సామాజిక సేవలో యువత

ఆశ్రమ విద్యార్థులకు స్టేషనరీ అందజేత



విద్యార్థులకు స్టేషనరీ వస్తువులు అందజేస్తున్న సంస్థ సభ్యుల

లాలాపేట: డీఎఫ్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతినగర్‌లోని అనాథశ్రమంలో నోటు పుస్తకాలు, పెన్నులు, ఇతర స్టేషనరీ వస్తువులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న తామంతా కలిసి సేవ చేయాలనే ఉద్దేశంతో తలా ఇంత వేసుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో నిరాశ్రయులకు బెడ్‌షీట్లు, రెయిన్ కోట్లు, గొడుగులు అందజేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు దీపక్ వర్మ, నజీబ్, నర్సింగ్, శేఖర్, బాలకృష్ణ, శివకుమార్, నాగరాజు, దత్తు, హర్షద్, రియాజ్, విక్రం, ఎల్లారెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు విక్టర్ సామ్, సునీత పాల్గొన్నారు.

ఘనంగా ఫీస్ట్ వేడుకలు



ఫీస్ట్ వేడుకల్లో పాల్గొన్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు మడ్‌ఫోర్డ్ సేయింట్ ఆంథోని చర్చి ఫీస్ట్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు, తెలుగు, తమిళ్ మాస్, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆరేళ్లుగా చర్చిలో సేవలందజేసిన రెవరెండ్ ఫాదర్ జాన్ భాస్కర్‌రావు వీడ్కోలు సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్డినల్ పూల ఆంథోని, రెవరెండ్ ఫాదర్ బాలాజీ బొయేల్లా, ఎరువా బాలశౌరి, విక్టర్ ఇమ్మానుయేల్, రమేష్ పాల్గొన్నారు.

సివిల్స్ ప్రిలిమినరీకి 331 మంది హాజరు



పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో ఆదివారం సివిల్స్–2024 ప్రిలిమినరీ ప్రశాంతంగా జరిగాయి. పేపర్ వన్ పరీక్ష ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరిగిన పేపర్–2 పరీక్షకు మొత్తం 331 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అరగంట ముందే పరీక్ష కేంద్రం వద్ద గేట్లను మూసివేశారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపల్ ప్రొ.రవికుమార్ తెలిపారు.

కౌన్సెలింగ్ ద్వారానే సీట్లను భర్తీ చేయాలి

లిబర్టీ: ఇంజినీరింగ్ బీ కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్ ద్వారానే భర్తీ చేయాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. యాజమాన్యం కోటా కింద లక్షలాది రూపాయలు దండుకొని సీట్లు అమ్ముకుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అన్నింటా వెనుకబడి దయనీయ జీవితాలు వెళ్లడిస్తున్న బీసీ విద్యార్థులకు అన్యాయం చేయవద్దని ఆయన కోరారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఇంజినీరింగ్ బీ కేటగిరీ సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయకుండా ఇంజినీరింగ్ కళాశాల యజమాన్యాలు లక్షలాది రూపాయలకు అమ్ముకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలోని దాదాపు 600 పైగా ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలు విద్యను వ్యాపారంగా మార్చాలని విద్యను పేదలకు అందకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు అమ్ముకోకుండా కౌన్సిలింగ్ ద్వారానే భర్తీ చేయాలని కుమారస్వామి కోరారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

లక్డీకాపూల్: పేద విద్యార్థుల చదువులకు అవసరమైన సహాయం చేసి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం లక్డీకాపూల్‌లోని ఎంఎస్ఆర్ ట్రస్ట్ కార్యాలయంలో నిరుపేదలైన విద్యార్థులకు చదువులకు సహాయం అందించారు. ఈసందర్భంగా ప్రసాద్‌కుమార్ హాజరై మాట్లాడారు. విద్య, వైద్యానికి సహాయం చేసేవారు మంచి పేరు సంపాదిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులకు చెక్కుల రూపంలో సాయం అందచేశారు. ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీష రెడ్డి పాల్గొన్నారు.

'ద్వానా'శాస్త్రికి ఘన నివాళి

చిక్కడపల్లి: ద్వానాశాస్త్రి అని పిలవబడే ద్వాదశి నాగేశ్వర శాస్త్రి వివిధ పత్రికలకు పలు సాహితీ ప్రక్రియల్లో రచనలు అందించి సాహితీ ఖజానాగా గుర్తింపు పొందారని ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకని కొనియాడారు. ఆదివారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికపై 'ఎందరో మహానుభావులు' కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ద్వానా శాస్త్రి జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎందరో గ్రంథాలకు సమీక్షలు నిర్మోహమాటంగా రాసిన శాస్త్రి 80కి పైగా వివిధ ప్రక్రియల్లో రచనలు చేశారని వివరించారు. తెలంగాణ సాహిత్య వీణ పేరిట రాష్ట్రంలో లబ్ధ ప్రతిష్ఠ పొందిన గత కాలపు సాహితీవేత్తలను నేటి వారికి పరిచయం చేశారన్నారు. ఇది పరిశోధక విద్యార్థులకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. స్నేహశీలి ఉత్తమ వ్యక్తిత్వం కలశాస్త్రికి గానసభతో తన అన్నదీక్షితులుతో ఆత్మీయ అనుబంధం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన 12గంటల సాహితీ ప్రసంగం గానసభలో చేసినప్పుడు అశేష ప్రేక్షకులు ప్రత్యేకించి సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు హాజరు కావటం విశేషమన్నారు. ప్రముఖ గాయని ఆమని తదితరులు పాల్గొన్నారు.

అధునాతన నిర్మాణం.. పునాదికే పరిమితం!

సీతాఫల్‌మండిలో అధునాతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులు ఆదిలోనే హంసపాదు అన్నచందంగా మారాయి. ఇక్కడున్న ఆసుపత్రిని నేలమట్టం చేసి ప్రతిష్టాత్మకంగా నిర్మించాలన్న లక్ష్యం ముందుకు సాగడం లేదు. ఏడాదిలోపు నిర్మాణం పనులు పూర్తిచేస్తామన్న హామీ నెరవేరలేదు. ఆసుపత్రి పాత భవనాన్ని కూల్చివేత పనులు వేగవంతంగా పూర్తి చేశారు. కొత్త భవనం నిర్మాణం పనులు ప్రారంభించి ఇప్పటికి ఏడాది అయినా నేటికీ పునాది పనులు కూడా మొత్తంగా పూర్తి కాకపోవడం విడ్డూరం. పాత ఆసుపత్రి భవనంలోని పలు రకాల వైద్య సేవలు వివిధ ప్రాంతాల్లోని భవనాల్లోకి బదలాయించడంతో రోగులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

–సికింద్రాబాద్



బేస్‌మెంట్ పనులతోనే నిలిచిపోయిన ఆసుపత్రి నిర్మాణ పనులు

- కుట్టివెల్లోడి భవనానికి మోక్షమెప్పుడు?
- చెల్లాచెదురైన వైద్యసేవలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పనులు ప్రారంభించాలంటున్న స్థానికులు
- స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు

రూ.12.75 కోట్ల నిధులతో..

సీతాఫల్‌మండి ప్రజలకు వైద్యసేవలు అందించడం కోసం 1963లో ప్రారంభించారు. అప్పటి జిల్లా కలెక్టర్ కుట్టివెల్లోడి ఆసుపత్రిని మంజూరు చేసినందున ఆసుపత్రికి ఆమె పేరును నామకరణం చేశారు. తొలినాళ్లలో ఐదారు పడకల వసతితోనే ఇక్కడ మెటర్నిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. క్రమేణా 50 పడకల ఆసుపత్రిగా విస్తరించింది. ప్రసూతి సేవలతో పాటు వివిధ రకాల సాధారణ వైద్య సేవలను అందుబాటులోకి వచ్చాయి. ఏడాది క్రితం ఈ ఆసుపత్రిని ఆధునీకరించాలన్న లక్ష్యంతో కొత్త ప్రతిపాదనలు రూపొందించారు. 70 పడకల వసతితోపాటు అన్ని రకాల వైద్యపరీక్షలు, శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తెచ్చేందుకు అధునాతన భవన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సదరు ప్రతిపాదనలకు కార్యరూపం ఇవ్వడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.75 కోట్ల నిధులను మంజూరు చేసింది.

రెండు భవనాలు నేలమట్టం..

అధునాతన ఆసుపత్రి నిర్మాణం కారణంతో ఇక్కడి రెండు ఆసుపత్రి భవనాలను నేలమట్టం చేశారు. ఫలితంగా ఇందులో ఏడాది క్రితం వరకు కొనసాగిన వైద్యసేవలు చెల్లాచెదురయ్యాయి. ఇక్కడి పాత భవనాల్లో కొనసాగిన మెటర్నిటీ సేవలను మెట్టుగూడలోని రైల్వే ఆసుపత్రి సమీపంలోని పురాతన ఆర్టీసీ భవనంలోకి బదలాయించారు.పాత ఆసుపత్రి భవనంలో ఉన్న అర్బన్ కమ్యూనిటీ ఆసుపత్రిలోని సాధారణ వైద్యసేవలను సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం భవనానికి మార్చారు. ఇదే భవనంలోకి డయాగ్నొస్టిక్ సేవా కేంద్రాన్ని మార్చారు.క్షయ వ్యాధి నిర్ధారణ, నిర్మూలన కేంద్రం సేవలను రెడ్‌క్రాస్ సొసైటీ ఆసుపత్రికి, కుష్టు తదితర వైద్య సేవలను గాంధీ ఆసుపత్రికి బదలాయించారు.



భవన నమూనా చిత్రం

అరకొర వసతులు..

అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పుడు రోగులకు పెద్దగా ఇబ్బందులు ఉండేవి కావు. వైద్యసేవలతోపాటు కుట్టివెల్లోడి ఆసుపత్రిలో వివిధ రకాల పరీక్షలు, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉండేవి. అన్ని రకాల వైద్యులు ఒకే కేంద్రంగా ఉండేవారు. ఏడాది కాలంగా పాత భవనాన్ని నేలమట్టం చేయడంతో వైద్యసేవలు దూరప్రాంతాలకు తరలివెళ్లడంతో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెట్టుగూడలో పురాతన భవనంలో ఏర్పాటు చేసిన మెటర్నిటీ ఆసుపత్రి సేవలు అరకొరగానే ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ భవనంలోనూ రోగులకు అవసరమైన సేవలు లేవు. వైద్యులు సిబ్బంది కూడా ఇరుకైన గదుల్లోనే వైద్యసేవలు అందిస్తున్నారు. కుష్టు, క్షయ వ్యాధి సేవల కోసం వచ్చే రోగులు నానా ఇక్కట్లకు గురవుతున్నారు.

త్వరగా నిర్మించాలి..

ఏడాదిలోగా ఆసుపత్రి భవనం నిర్మాణం పనులు పూర్తిచేస్తామన్న ప్రకటనతో నిర్మాణం పనులు మొదలైనా ఆదిలోనే అర్ధతరంగా నిలిచిపోయాయి. 2023 మే 21న నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదవుతున్నా నేటికీ బేస్‌మెంట్ పనులు కూడా పూర్తి కాలేదు. మధ్యలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుతం ఎలాంటి అవాంతరాలు లేకపోవడంతో పాలకులు, అధికారులు స్పందించి అధునాతన వైద్య సేవల భవనాన్ని త్వరగా నిర్మించాలని సీతాఫల్‌మండి వాసులు కోరుతున్నారు.

గొర్రెలకాపరులకు న్యాయం చేయాలి

లాలాపేట: డీడీలు చెల్లించిన గొర్రెలకాపరుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని ఆ సంఘం సభ్యులు కోరారు. రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు ఆదివారం రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్ యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం హయాంలో గొర్రెల పంపిణీ పథకంలో రెండో విడత కోసం చాలా మంది గొర్రెల కాపరులు అప్పులు చేసి డీడీలు చెల్లించారని, సంవత్సరాలుగా గొర్రెల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారని ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్ యాదవ్, జిల్లాల అధ్యక్షులు గజ్జి రమేష్ యాదవ్, మధుయాదవ్,కొమురయ్య యాదవ్, రాజేందర్ యాదవ్, విష్ణు యాదవ్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.



అనీల్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుంది



కార్యక్రమంలో పాల్గొన్న కల్నల్ అనిల్ యాదవ్

లాలాపేట: శాంతినగర్ లాలాగూడలోని తక్షశిల పబ్లిక్ స్కూల్లో ఇన్వెస్టిచర్ సెర్మనీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని హెడ్ క్వార్టర్స్ ఎన్‌సీసీ విభాగానికి కమాండర్‌గా విధులు నిర్వహిస్తున్న కల్నల్ అనిల్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా కేబినెట్, క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి దైవ సన్నిధానం వార్షిక బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్: విశాఖ శ్రీశారదాపీఠ పాలిత ఫిలింనగర్ దైవ సన్నిధానం వింశతి (20వ) వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 17 (సోమవారం) నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు సోమవారం ఉదయం 8 గంటలకు విశేష అలంకారం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, మండపారాధన, హారతితో ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు. 18న ఉదయం 8 గంటలకు శ్రీస్మార్తాగమ, శ్రీవైఖానస ఆగమముల ప్రకారం విశేష అలంకారం, సాయంత్రం 5 గంటలకు శ్రీభ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జునస్వామి వారి శాంతి కల్యాణం హారతి, శేష వాహనం, రాత్రి 7 గంటలకు అమృత గోపాల్‌చే కర్ణాటక సంగీత కచేరీ ఉంటాయన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి వారికి పంచామృతాభిషేకం, విశేష అలంకారం, నిత్య హోమం, సాయంత్రం 5 గంటలకు శ్రీభూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి శాంతి కల్యాణం, గజ వాహనం, హారతి, రాత్రి 7 గంటలకు ఐశ్వర్యవల్లి కాకులపాటి శిష్యబృందంచే భరతనాట్య ప్రదర్శన ఉంటాయని తెలిపారు. 20న ఉదయం 7 గంటలకు శ్రీశ్రీ భూసమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి విశేష పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనం, అలంకారం, రాత్రి 7 గంటలకు గరుడసేవ, నిత్యపూజ, మోమం, ప్రసన్నలక్ష్మీ బృందంచే త్యాగరాజ సంకీర్తనల కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. 21న ఉదయం చూర్ణోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు ఊంజల్ సేవ, కైంకర్య దాతలకు స్వామి వారి శేష వస్త్ర ప్రసాదం, జ్యోతి పూర్ణిమచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 8 గంటలకు ధ్వజారోహణం ఉంటాయని వివరించారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ మధ్యాహ్నం 12.30 నుంచి 3 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.57, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 60, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 55, పందిరి బీర 75, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 35, గుండుబీన్స్ 135, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 35, దోసకాయ 28, రూట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 35, ఆలుగడ్డ 33, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నూతన కమిటీ నియామకం

రసూల్‌పురా: ఎమ్మార్పీఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గం మూడవ వార్డు నూతన కమిటీ నియమాకం ఆదివారం జరిగింది . నియోజకవర్గ ఇన్‌చార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ, కన్వీనర్ రొట్టేల సునీల్ మాదిగ నేతృత్వంలో జరిగిన సమావేశంలో వార్డు ఇన్‌చార్జిగా రాకేష్ మాదిగ, అధ్యక్షుడు నవీన్ మాదిగ, ఉపాధ్యక్షుడు కార్తీక్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, మధు మాదిగలను నియమించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయమై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ తమపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.

'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ'పై విచారణ జరిపించాలి

కాచిగూడ: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే బిహార్‌కు చెందిన గ్యాంగ్ నీట్ పేపర్ లీకేజ్ చేశాయన్న విషయం బయటకు రావడంతో ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీ వెంటనే స్పందించాలన్నారు. మెడికల్ కౌన్సెలింగ్‌ను వెంటనే నిలిపివేయాలని, అర్హులైన విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోనే నీట్ పరీక్ష పెద్ద స్కామ్‌గా మారిందని, నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై సీబీఐ దర్యాప్తు సంస్థచే విచారణ జరిపించాలన్నారు. ఈ స్కామ్ వెనుక ఉన్న ఎంతటి వారినైనా వదిలిపెట్టకుండా దేశద్రోహం కింద శిక్షించాలన్నారు. లేని పక్షంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నేతృత్వంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాజేష్ పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యల పరిష్కారమే లక్ష్యం



సనత్‌నగర్: అనునిత్యం సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని టీపీసీసీ కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ స్పష్టం చేశారు. బేగంపేట డివిజన్ మోతీలాల్‌నెహ్రూనగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. కాలనీలో పాదయాత్ర చేస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం ఆధ్వర్యంలో కాలనీవాసులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పలు సమస్యలను నీలిమ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తమ కాలనీలో సరైన రహదారి సౌకర్యం లేకపోవడం, ఉన్న రోడ్లు అధ్వానస్థితిలో ఉన్నాయని కాలనీలో మరింతగా పచ్చదనాన్ని పెంపొందించేలా పార్కుల నిర్వహణ జరిగేలా చూడాలని కోరారు. కాలనీని కమర్షియల్ జోన్‌లో నుంచి తొలగించి కమర్షియల్ ఫ్రీ కాలనీగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ.. కాలనీలో కొత్త రోడ్ల అభివృద్ధికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. అలాగే పార్కుల నిర్వహణ మరింత పకడ్బందీగా జరిగేలా చూస్తానని, కాలనీలో మరింతగా పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు వివరించనున్నట్లు చెప్పారు. పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రజా సమస్యలను తెలుసుకోవడానికే తాను పరిమితం కాదని, వాటి పరిష్కారం జరిగే వరకు వదలబోనన్నారు. మోతీలాల్‌నెహ్రూనగర్ నివాసితులకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్, ప్రతినిధులు చంద్రశేఖర్, శ్రీశైలం, శ్రీనివాస్ పటేల్, రూపాల్ షా పాల్గొన్నారు.



మోతీలాల్ నెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న కోట నీలిమ

వృద్ధాశ్రమాల సంఖ్య తగ్గించాలి



వేడుకల్లో పాల్గొన్న రజనీప్రియా

రసూల్‌పురా: నేటితరం యువత తల్లిదండ్రుల విలువ తెలుసుకుని వృద్ధాప్యంలో వారి పట్ల బాధ్యతగా నడుచుకుంటూ వృద్ధాశ్రామాల సంఖ్య తగ్గించాలని రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజనీప్రియా సూచించారు. అంతర్జాతీయ పితృదినోత్సవం పురస్కరించుకుని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం రజనీప్రియా నేతృత్వంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లోని వయోవృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు, బాలసదన్ల నుంచి వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబంలో తండ్రి పాత్ర, ఔనత్యం, తండ్రి ప్రేమ, బాధ్యత గురించి తెలుపుతూ నాగారం గాయత్రి స్కూల్ ఆఫ్ కూచిపూడి డాన్స్, కేపీహెచ్‌బీ కలర్స్ ఆఫ్ డాన్స్ ఆధ్వర్యంలో గీతాలాపన, నృత్య ప్రదర్శన తదితర సాంస్కృతిక ప్రదర్శనలు ఆలోజింపజేశాయి. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సెంటర్ ఫర్ సోషల్ సర్వీస్, కూకట్‌పల్లి, సాకేత్ పర్సనవ్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, బాలనగర్ ఆధార్ వెల్ఫేర్, బహదూర్ పల్లి గౌరి ఆశ్రమం గర్ల్స్ హోమ్, గవర్నమెంట్ చిల్డ్రన్స్ గర్ల్స్ హోమ్, బాలసదన్, చిన్నారులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

జోరుగా గొర్రెలు, పొట్టేళ్ల విక్రయాలు

సనత్‌నగర్: బక్రీద్‌ను పురస్కరించుకుని గొర్రెలు, పొట్టేళ్ల అమ్మకాలు ఆదివారం జోరుగా సాగాయి. ఎర్రగడ్డ–సనత్‌నగర్ రహదారిలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటుచేసి విక్రయాలు జరిపారు. ఆదివారం మార్కెట్ కావడంతో గొర్రెలు, మేకల కొనుగోలుదారులతో కిటకిటలాడింది. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది గొర్రెల దిగుమతి తగ్గడం..ఇదే క్రమంలో డిమాండ్ పెరగడంతో ధరలు కూడా పెరిగిపోయాయి. గత ఏడాది రూ.10 వేలు పలికిన గొర్రె ఈ ఏడాది రూ.15 వేలకు తగ్గడం లేదు. చెంగిచెర్ల, కర్నూలు, కడప, పెబ్బర్ వంటి దూర ప్రాంతాల నుంచి నగరానికి తీసుకురావడంలో రవాణా భారం కూడా అధికంగా ఉంది. రవాణా జరిగే సమయంలో కొన్ని జీవాలు దెబ్బతినడం, వాటిని కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురాకపోవడం వంటి తదితర కారణాలతో కూడా ధరలు పెరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొనుగోలుదారులు కూడా అంత పెద్దమొత్తం చెల్లించి కొనాలంటే ఆలోచిస్తున్నారని ఇక్కడి వ్యాపారులు చెబుతున్నారు.



ఎర్రగడ్డ-సనత్‌నగర్ రహదారిలో అమ్మకానికి ఉంచిన గొర్రెలు, పొట్టేళ్లు

బ్యాగులో ఉంచిన ల్యాప్‌టాప్ మాయం

వెంగళరావునగర్: బ్యాగ్‌లో ఉంచిన ల్యాప్‌టాప్ మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఏపీలోని అనంతపురం జిల్లా గుత్తి ప్రాంతానికి చెందిన హేమలత మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ అమీర్‌పేటలో చదువుతోంది. ఈ నెల 13వ తేదీ రాత్రి తన ల్యాప్‌టాప్‌ను బ్యాగ్‌లో ఉంచి నిద్రపోయింది. ఉదయం లేచి బ్యాగ్ చూసేసరికి ల్యాప్‌టాప్ మాయమైంది. పలుప్రాంతాల్లో వెదికినా ప్రయోజనం లేనందున మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాట్య ప్రదర్శనకు పంపుతామని నగదు తీసుకుని మోసం

నాట్య ప్రదర్శనకు పంపుతానని నగదు తీసుకుని మోసం చేసిన మహిళపై బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన వినీల మధురానగర్‌లో కూచిపూడి నేర్పిస్తుంటుంది. ఆమెకు ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన మనోజ్ఞ అనే మహిళ కూచిపూడి నృత్య ప్రదర్శన చేయించడానికి వినీలతో ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో నాట్య ప్రదర్శన ఉంటుందని మనోజ్ఞ తెలియజేసింది. ఇందుకోసం దాదాపు 12 మంది కళాకారుల నుంచి రూ. 2.40 లక్షల వరకు వినీల ప్రోగ్రాం మేనేజర్ మనోజ్ఞకు ఆమె భర్త అకౌంట్ ద్వారా పంపించారు. అనుకోకుండా మనోజ్ఞ భర్త మృతిచెందాడు. దాంతో నాట్య ప్రదర్శనలు రద్దు చేశారు. ప్రదర్శనల నిర్వహణ కోసం తీసుకున్న నగదును తిరిగి ఇవ్వాలని వినీల ఆమెను అడగ్గా తాను ఇవ్వనంటూ చెప్పింది. దాంతో తాము మోసపోయామని గ్రహించిన వినీల, ఆమె శిష్య బృందం మధురానగర్ పీఎస్‌లో మనోజ్ఞపై ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువత ఉపాధి వైపు పయనించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయనించి జీవనోపాధిని పొందాలని కేశవ స్మృతి సంవర్ధన సమితి అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ శిబిరం ఐదో జట్టు 25 మందితో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి యువతలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ యజమాని కె.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.